
నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 3 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM



జడ్పీ చైర్మన్ దంపతులను శాలువాతో సత్కరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

## మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్మన్ దంపతులు

మధిర, జూలై 2: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు దంపతులు మంగళవారం కలిశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ కమల్‌రాజు, వసంతరాణి దంపతులను కేసీఆర్ శాలువాతో సత్కరించారు.

## కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి

- ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి
- మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, జూలై 2 : రైతు బాగుంటేనే దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని, కాంగ్రెస్ పాలనలో మళ్లీ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని బీఆర్ఎస్ ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు భోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభాకర్ తండ్రి పెద్దవీరయ్యతో నామా ఫోన్‌లో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకొని కుటుంబసభ్యులను ఓదార్చారు. రైతు తనకు జరిగిన అన్యాయాన్ని అధికారాలకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాకర్ కుటుంబానికి ఆర్థికసాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేశారని ఈ సందర్భంగా నామా గుర్తుచేశారు.

## 'రోళ్ల పాడు'తో సాగు నీరందించాలి

- మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్
- అఖిలపక్షం ఆధ్వర్యంలో రోళ్ల పాడు ప్రాజెక్టు ప్రాంతం సందర్శన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, జూలై 2 : రోళ్లపాడు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన రోళ్లపాడు ప్రాజెక్టు ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అఖిలపక్ష నాయకులతో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హరిప్రియ, గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ నియోజకవర్గం చుట్టూ నీటి వసతులు పుష్కలంగా ఉన్నాయని, ఈ క్రమంలో వాటిని సద్వినియోగం చేసుకునేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ప్రతి ఎకరాకు నీరందించాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ రూ.3,200 కోట్లు మంజూరు చేసి డీపీఆర్ చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య దీనిపై దృష్టి సారించి మరిన్ని నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకుడు ఏపూరి బ్రహ్మం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, సీపీఐ నాయకుడు దేవరకొండ శంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ఇల్లెందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ ఇల్లెందు వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్, వివిధ పార్టీల నాయకులు నాయిని రాజు, బుర్ర వెంకన్న, బోడ బాలు, గిన్నారపు రాజేశ్, రైతులు పాల్గొన్నారు. అనంతరం అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌ను అఖిలపక్ష నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి నియోజకవర్గానికి నీరు అందే వరకు పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు.

## అటవీశాఖ కార్యాలయం ఎదుట పోడుదారుల నిరసన

- 20ఎకరాల ప్లాంటేషన్ భూమిని అప్పగించడంపై మండిపాటు



అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పోడుదారులు

చండ్రుగొండ, జూలై 2 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చండ్రుగొండ అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఎదుట మద్దుకూరు పోడుదారులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళ్తే.. మద్దుకూరు గ్రామానికి చెందిన 20మంది పోడుదారులు సుమారు రెండేండ్ల క్రితం 20 ఎకరాల అటవీశాఖ భూమిని సాగు కోసం పోడు కొట్టారు. దీంతో అధికారులు స్పందించి ఆ భూమిని ప్లాంటేషన్ మొక్కలు వేస్తామని చెప్పి వారివద్ద నుంచి లాక్కున్నారు. అయితే ఈ ఏడాది ఆ భూమిలో పోడు పట్టాలు కలిగిన అదే గ్రామానికి చెందిన కొందరు సాగు చేసుకుంటున్నారు. దీంతో పోడుదారులు అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి వచ్చి అక్కడే ఉన్న బీట్ అధికారి భాస్కర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్లాంటేషన్ కోసమని తమ దగ్గరనుంచి లాక్కున్న భూమిని వారికి అప్పనంగా, అడ్డదారిలో ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## బ్రేక్ దర్శనాలు షురూ..

- రామాలయంలో ప్రారంభించిన ఈవో రమాదేవి



రామాలయంలో బ్రేక్ దర్శనాన్ని ప్రారంభిస్తున్న దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, జూలై 2 : పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బ్రేక్ దర్శనాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మంగళవారం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి 9.30 వరకు, సాయంత్రం 7 నుంచి 7.30 వరకు బ్రేక్ దర్శనం భక్తులకు అందుబాటులో ఉంటుంది. దీనికి టికెట్ ధర రూ.200గా నిర్ణయించారు. టికెట్ కొనుగోలు చేసి సంప్రదాయ దుస్తులు ధరించిన భక్తులను అంతరాలయంలోని బంగారు వాకిలి వరకు, ప్యాంటు, షర్టు ధరించిన వారిని మాత్రం వెండివాకిలి వరకు అనుమతిస్తారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో కూడా బ్రేక్ దర్శనం టికెట్లను అందుబాటులో ఉంచామని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం రానివారు దేవస్థానం కౌంటర్ వద్ద టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం నీడ కల్పించేందుకు సీఎంఆర్ వారి సహకారంతో షెడ్డు ఏర్పాటు చేశామని, భక్తుల కోసం ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ కూడా అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ఎన్ని వేల మంది భక్తులు వచ్చినా 11.30 నుంచి 2.30 వరకు అన్న ప్రసాదాన్ని స్వీకరించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, ఈఈ రవీందర్‌రాజు, వేద పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, సన్యాసి శర్మ, అర్చకులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## వర్షం కురిసినా వాగుదాటి 2 కి.మీ. నడవాల్సిందే..



పండువారిగూడెం పాఠశాలకు కాలినడకన వస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్ మండలం మారుమూల గిరిజన గ్రామ విద్యార్థులది మరీ దయనీయ పరిస్థితి. అశ్వారావుపేట మండల కేంద్రానికి 20 కిల్లో మీటర్ల దూరంలో మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ ఉంది. దాని పరిధిలోని కొండతోగు గ్రామంలో సుమారు 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుటుంబాలకు చెందిన కొందరు పిల్లలు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్నారు. ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే వారి గ్రామానికి 2 కిల్లోమీటర్లకుపైగా దూరంలో ఉన్న పండువారిగూడేనికి వెళ్లాలి. వర్షాకాలంలో కొండతోగు, పండువారిగూడెం గ్రామాల మధ్య ఉన్న వాగును దాటాలి. ప్రమాదమైనప్పటికీ విద్యార్థులు ఆ వాగును దాటి పాఠశాలకు వెళ్లివస్తున్నారు. ప్రస్తుతం కొండతోగు గ్రామానికి చెందిన సోడెం అఖిల్ (4వ తరగతి), పూసం సాయివినయ్ (2వ), చేప రామ్‌తేజ్ (4వ), తుర్సం మీనాక్షి (3వ), పూసం సాయి విఙ్ఞేశ్ (2వ), తుర్సం మణిత (1వ), తుర్సం సాయి జస్వంత్ (1వ తరగతి) చదువుతున్నారు. వీరిలో చాలా మంది పిల్లలు కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేని పరిస్థితుల్లో కొండతోగు నుంచి పండువారిగూడెం ప్రభుత్వ పాఠశాలకు వచ్చివెళ్తున్నారు.

# బస్సొస్తే బడికి..
# రాకుంటే ఇంటికి..

- ఆర్టీసీ బస్సు సౌకర్యాలు లేక అల్లాడిపోతున్న 'ప్రభుత్వ' విద్యార్థులు
- బస్సు రాకున్నా, వచ్చినా ఆపకున్నా.. చేసేదేమీలేక ఇంటిబాట..
- కొన్నిచోట్ల ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లి వస్తున్న చిన్నారులు
- మరికొన్ని చోట్ల ఎండావానల్లో కిలోమీటర్ల మేర కాలినడకన రాకపోకలు
- 'మహిళలకు ఉచితం' పేరిట మారుమూల ప్రాంతాలకు 'ఆర్టీసీ' బంద్
- ఫలితంగా బస్సులపై ఆధారపడిన విద్యార్థుల చదువులు అగమ్యగోచరం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 208 గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు నిల్



దుమ్ముగూడెం మండలంలో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు



పెనుబల్లిలో ఆటోలో వెళ్తున్న విద్యార్థినులు

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జూలై 2 : 'బస్సొస్తే బడికి.. రాకుంటే ఇంటికి' అన్నట్లుగా ఉంది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల పరిస్థితి. 'పాఠశాలకు వెళ్తొస్తాం.. మా ఊరికి బస్సు నడపండి మహాప్రభో..' అంటూ నెత్తీనోరూ బాదుకున్నా కనికరించని కాంగ్రెస్ ప్రభుత్వం.. కనీసం వారివైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో కొన్నిచోట్ల నిరుపేద తల్లిదండ్రులు సొంతంగానే ఆటోలు, ఇతర వాహనాలను కిరాయికి మాట్లాడుకొని తమ పిల్లలను పాఠశాలలకు, కళాశాలలకు పంపుతున్నారు. మరికొన్ని చోట్ల అయితే ఎండలు, వర్షాల్లో కూడా విద్యార్థులు కిలోమీటర్ల మేర నడిచి పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంకొన్ని పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు చూడలేక అక్కడి ఉపాధ్యాయులే వారికి ఆటోలతో రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 'మహిళలకు ప్రయాణం ఉచితం' పేరిట 'మహాలక్ష్మి' పథకాన్ని తెచ్చిన కొత్త సర్కారు.. విద్యార్థుల కోసం నడపాల్సిన సర్వీసులను తగ్గించింది. ఈ నిర్ణయం విద్యార్థుల బంగారు భవితపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. పైగా, గ్రామీణ ప్రాంతాలకు నడిపే సర్వీసులను కూడా గణనీయంగా తగ్గించింది. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో బస్సులను తిప్పుతుండడంతో.. మండల కేంద్రాలు, పట్టణాల్లోని ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఫలితంగా వారి చదువులు కూడా అగమ్యగోచరమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. భద్రాద్రి జిల్లాలో 492 గ్రామాలకు రహదారి సౌకర్యాలు ఉండగా.. 208 గ్రామాలకు బస్సు సర్వీసులు నడపకపోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుతోంది.

### పాఠశాలలు ప్రారంభమై 20 రోజులైనా..

పాఠశాలలు ప్రారంభమై 20 రోజులైనా పొరుగు గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థుల సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టిన పాపానపోలేదు. ఇక విద్యార్థుల రాయితీ బస్‌పాస్‌ల సంగతి సరేసరి. ప్రధాన మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న కొన్ని పల్లెవెలుగు బస్సులు విద్యార్థినులను ఎక్కించుకోకుండానే వెళ్తున్నాయి. ఈ బాధలు భరించలేని కొంతమంది విద్యార్థులు పట్టణాల్లో ప్రైవేటు హాస్టళ్లను, అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు.

### 'భద్రాద్రి'లో 208 గ్రామాలకు సర్వీసులు నిల్..

పేరుకే పల్లె వెలుగు బస్సులైనా అవి కేవలం పట్టణాలకే పరిమితమవుతున్నాయి. దీంతో ఏజెన్సీ గ్రామాలు ఎక్కువగా ఉన్న భద్రాద్రి జిల్లాలో విద్యార్థులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ జిల్లాలో 492 గ్రామాలకు రహదారి సౌకర్యాలు ఉండగా.. ఇంకా 208 గ్రామాలకు బస్సులు రాకపోకలు సాగించడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో మారుమూల ప్రాంతాల విద్యార్థులు కొందరు సైకిళ్ల మీద స్కూల్‌కు వెళ్లి వస్తున్నారు. మరికొందరు విద్యార్థులను తల్లిదండ్రులు రోజూ దింపివస్తున్నారు.

### ఉన్న బస్సులను బంద్ పెట్టి..

కొన్ని ప్రాంతాల్లో అప్పటికే నడుస్తున్న బస్సులను కూడా ప్రస్తుత ప్రభుత్వం బంద్ పెట్టింది. కొన్ని ప్రాంతాల్లో ఈ విషయం స్పష్టంగా కన్పిస్తోంది. ఇల్లెందు మండలం సుదిమళ్ల మార్గంలో పూబెల్లి, ధర్మాపురం గ్రామాల్లో గతంలో బస్ నడిచేది. కానీ.. ఇప్పుడు ఆ సర్వీసు రద్దుచేశారు. దీంతో విద్యార్థులు ఆటోల్లో వెళ్లి వస్తున్నారు. టేకులపల్లి మండలం బోడు గ్రామానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే 12 పంచాయతీలను కలుపుతూ గతంలో బస్సు నడిచేది. ప్రస్తుతం ఆ బస్సునూ తీసేశారు. ములకలపల్లి మండలం చౌటుగూడెం, తిమ్మంపేట, మూకమామిడి, పొగళ్లపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఆయా గ్రామాల విద్యార్థులు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి ఆటోల్లో వచ్చి వెళ్తున్నారు. దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం–ఆర్లగూడెం మార్గంలో బస్సు లేకపోవడంతో అక్కడా అదే పరిస్థితి. పెద్దకమలాపురం, కొత్తూరు, దబ్బనూతలు, అంజిపాక గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో చుట్టూ 12 కిలోమీటర్లలోపు ఉండే విద్యార్థులందరూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇక భద్రాచలం–చర్ల మార్గంలో రాకపోకలు సాగించే బస్సులు.. దుమ్ముగూడెం ఊళ్లోకి వెళ్లడం లేదు. దుమ్ముగూడెం అడ్డరోడ్డు దగ్గరే బస్సులను ఆపుతుండడంతో అక్కడ దిగిన విద్యార్థులు కిలోమీటరు దూరం నడిచి దుమ్ముగూడెంలోని కళాశాలకు వెళ్లిరావాల్సి వస్తోంది. పెనుబల్లి మండలం తాళ్లపెంట, ఉప్పెనకుంట్ల, లింగగూడెం, బయ్యన్నగూడెం; కల్లూరు మండలం బత్తునపల్లి, కప్పలబంధం, రాళ్లబంజర, యర్రబంజర గ్రామాల విద్యార్థుల కోసం ప్రతి రోజూ ఒకే బస్సు నడుస్తోంది. ఆ బస్సు సరిపోకపోవడంతో చాలా మంది విద్యార్థులకు ఆటోలే దిక్కవుతున్నాయి.

### రోజూ కిలోమీటరు నడవాలి..



నేను ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాను. కాలేజీకి వెళ్లాలంటే రోజూ కిలో మీటరు నడవాల్సి వస్తోంది. నేనే కాదు.. మా గ్రామం నుంచి కాలేజీకి వెళ్లి వచ్చే పిల్లలమందరమూ రోజూ నడిచే వెళ్తాం. నడిచే వస్తాం. దుమ్ముగూడెం–చర్ల మార్గంలో నడిచే బస్సులను మా గ్రామంలో ఎక్కుతాం. అయితే బస్సులు మా కాలేజీ ఉన్న దుమ్ముగూడెంలోని వెళ్లడం లేదు. కిలోమీటరు ఇవతల ఉన్న దుమ్ముగూడెం అడ్డరోడ్డు వద్దనే ఆగుతున్నాయి. దీంతో మేమంతా అక్కడ దిగి దుమ్ముగూడెంలోని కళాశాలకు నడిచి వెళ్తున్నాం.

**– కుంజా జయవర్ధన్, బండిరేవు గ్రామం, దుమ్ముగూడెం మండలం, భద్రాద్రి జిల్లా**

### ఆటో ఎక్కి బడికి వెళ్తొస్తున్నా..



మాది ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామం. నేను బూర్గంపహాడ్‌లోని స్కూలుకు వెళ్లివస్తుంటాను. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. ఎక్కువమంది స్కూలు పిల్లలు లేరు అనే కారణంతో ఆర్టీసీ అధికారులు మా గ్రామానికి బస్సును నడపడం లేదు. దీంతో మా తల్లిదండ్రులు ప్రైవేటుగా ఆటో మాట్లాడారు. మేమే సొంతంగా కిరాయిలు భరించుకుంటూ ఆటోలో స్కూలుకు వెళ్లివస్తున్నాం. బస్సులేని కారణంగా ఆటోలో వెళ్లి రావడం కష్టంగా అనిపిస్తోంది. కానీ తప్పడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మా గ్రామానికి బస్సు నడపాలి.

**–శ్రీరమ అర్చన, తిమ్మంపేట గ్రామం, ములకలపల్లి మండలం, భద్రాద్రి జిల్లా**

### మహిళలకు ఉచితమని పిల్లలకు అన్యాయం చేశారు..



నా కుమారుడు 4వ తరగతి చదువుతున్నాడు. చదువు కోసం ప్రతీ రోజూ ఇల్లెందుకు ప్రయాణించాల్సి వస్తోంది. బస్సు లేకపోవడంతో అందుబాటులో ఏ వాహనం ఉంటే ఆ వాహనాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. మా ఊరికి గతంలో బస్సు నడిచేది. ఇప్పుడు దానిని తీసేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సులే పెట్టి.. విద్యార్థులకు అన్యాయం చేసింది. బడి పిల్లల కోసం బస్సులు నడపాలి.

**–మచ్చ గోపమ్మ, ధర్మాపురం గ్రామం, ఇల్లెందు మండలం**

### ఇప్పటికీ ఆటోలోనే వచ్చి వెళ్తున్నా..



నా పేరు ప్రణవి, ఐదో తరగతి చదువుతున్నాను. మాది తిమ్మంపేట గ్రామం. మా ఊరికి బస్సు రాదు. దీంతో నేను ఒకటో తరగతి నుంచి ఇప్పటి వరకూ ఆటోలోనే ములకలపల్లికి వస్తూ చదువుకుంటున్నాను. నాతోపాటు మా గ్రామంలోని చాలా మంది పిల్లలు నాతోపాటే ఆటోల్లో వస్తున్నారు. మా ఊరికి బస్సును నడిపిస్తే బాగుంటుంది.

**–ఊటుకూరు ప్రణవి, 5వ తరగతి, తిమ్మంపేట, ములకలపల్లి**

### 15 కిలోమీటర్లు ప్రైవేటు వాహనంలో వెళ్తున్నాం..



మాది అంజిపాక గ్రామం. నేను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. పెదకమలాపురం, దుబ్బనూతల గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో అక్కడి నుంచి 15 కిలోమీటర్ల వరకు ప్రైవేటు వాహనాలపై వస్తున్నాను. ఒక్కోసారి ఏదైనా బైకును లిఫ్ట్ అడిగి రావాల్సి వస్తోంది. మావన్నీ పల్లెటూళ్లే. బస్సులు సరిగా రావడం లేదు. ప్రభుత్వ కాలేజీలో చదువుకునే వారికోసమైనా బస్సులు నడపాలి.

**–ఉబ్బ హర్షిత్, అంజిపాక, దుమ్ముగూడెం మండలం**

### వైరాలో ఆటో ఏర్పాటు చేసిన హెచ్ఎం, టీచర్లు



విద్యార్థులను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

వైరా మండలంలో విద్యార్థుల కోసం స్వయంగా పాఠశాల హెచ్ఎం, టీచర్లే సొంతంగా ఆటోను ఏర్పాటుచేశారు. ఆ మండలంలోని లింగన్నపాలెం, విప్పలమడక గ్రామాలకు చెందిన 18 మంది విద్యార్థులు సమీపంలోని గరికపాడు పాఠశాలకు ప్రతి రోజూ వెళ్లివస్తుంటారు. అయితే తరచూ ఆ బస్సు ఆలస్యమవుతుండడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకోవడం లేదు. తరగతులను కోల్పోతున్నారు. దీంతో పాఠశాల హెచ్ఎం, టీచర్లు స్పందించి సదరు విద్యార్థుల కోసం వారే స్వచ్ఛందంగా ఓ ఆటోను ఏర్పాటు చేశారు.

### బస్సు లేటుగా వస్తోంది..



వైరా నుంచి ఉదయం 8 గంటలకు బయల్దేరాల్సిన బస్సు 8:40 గంటలకు బయలుదేరుతోంది. దీంతో విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. 8:40కి వైరాలో బయలుదేరితే స్టేజీ పినపాక, సిరిపురం, నారపునేనిపల్లి, విప్పలమడక, లింగపాలెం మీదుగా గరికపాడు చేరుకునే సరికి పాఠశాల సమయం దాటిపోతోంది. ఈ ఇబ్బందులు పడలేని కొందరు తల్లిదండ్రులు.. ఆర్థిక భారమైనప్పటికీ ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు.

**– దొంతెబోయిన సత్యనారాయణ, హెచ్ఎం, జడ్పీఎస్ఎస్, గరికపాడు**

## యుద్ధ ప్రాతిపదికన కాలువలు పూర్తి చేస్తాం

- వైరా, లంకాసాగర్‌ల ఆయకట్టు స్థిరీకరణకు లింక్ కెనాల్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బీరోలులో 'సీతారామ' టన్నెల్ నిర్మాణ పనుల పరిశీలన



మండలంలోని దమ్మాయిగూడెం, బీరోలు ప్రాంతాల్లో సీతారామ – పాలేరు లింక్ టన్నెల్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, జూలై 2: ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పంటల సాగు కోసం గోదావరి జలాలను అందించే సీతారామ ప్రాజెక్టు కాలువల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. తిప్పారెడ్డిగూడెం, దమ్మాయిగూడెం, బీరోలు ప్రాంతాల్లో జరుగుతున్న సీతారామ – పాలేరు లింక్ కెనాల్ సొరంగ మార్గ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు మొదటి లిఫ్టులో వెట్ రన్ ట్రయల్‌ను ఇటీవల పూర్తి వేశామని అన్నారు. హెడ్ రీచ్‌లో పనులు పూర్తయినప్పటికీ టెయిల్‌పాండ్ అయిన పాలేరు వరకు సాగునీరు రావడానికి మధ్యలో కొన్ని ప్రాంతాల్లో మెయిన్ కెనాల్ తవ్వకానికి టెండర్లు కాలేదని అన్నారు. యుద్ధప్రాతిపదికన టెండర్లు పిలిచి ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని చెప్పారు. నాగార్జునసాగర్ పరిధిలో ఉన్న జిల్లాలోని 1.55 లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులైన వైరా, లంకాసాగర్ ఆయకట్టును, ఇతర మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆయకట్టును స్థిరీకరించేందుకు రూ.100 కోట్లతో ఓ లింక్ కెనాల్‌ను నిర్మించనున్నట్లు వివరించారు. ఈ లింక్ కెనాల్‌ను ఏన్కూరు వద్ద నాగార్జునసాగర్‌లో డ్రాప్ చేయనున్నట్లు తెలిపారు. కాగా, పనుల్లో నాణ్యతా లోపాన్ని గుర్తించిన మంత్రి పొంగులేటి.. ఇరిగేషన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బోడ మంగీలాల్, బెల్లం శ్రీనివాసరావు, రామకృష్ణ, శేషాద్రి, బానాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలి

- పాలమూరు-రంగారెడ్డి పథకానికి జాతీయహోదా కల్పించాలి
- కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి
- కేసీఆర్ పాలనలో అద్భుతమైన ప్రగతి
- 2014- 23 వరకు తెలంగాణలో స్వర్ణయుగం
- రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జూలై 2 : రాష్ట్రంలోని పాలమూరు–రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాలని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పాలని, బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన రాజ్యసభలో తెలుగులో చక్కగా మాట్లాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి బీఆర్ఎస్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సుపరిపాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. తెలంగాణ ఏర్పడిన స్వల్పకాలంలోనే గొప్పగా అభివృద్ధి చెందిన తీరును పార్లమెంట్ సాక్షిగా సవివరంగా ఆవిష్కరించారు. 18వ లోక్‌సభ కొత్తగా కొలువుదీరిన సందర్భంగా తనను రాజ్యసభకు రెండోసారి పంపిన కేసీఆర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ 11నుంచి 5వ స్థానానికి రావడం అభినందనీయమన్నారు. ఈ విధంగా దేశం మరింత బలోపేతం కావాలని ఆశిస్తున్నానని తెలిపారు. కేసీఆర్ సారథ్యంలో 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు సాగిన తెలంగాణ రాష్ట్ర ప్రగతి నిజంగా ఒక స్వర్ణయుగమని అన్నారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన బృహత్తర పథకాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతంగా చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాలు సాగులోకి తీసుకువచ్చారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు వరంగల్ జిల్లాలోని కొంతభాగం సాగులోకి వచ్చేలా ప్రతిష్టాత్మకంగా సీతారామ ప్రాజెక్టు పనులను 90శాతం పూర్తి చేశారన్నారు. సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ వారం కిందట విజయవంతమైందన్నారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 11లక్షల ఎకరాల బీడు భూములు సాగులోకి రానున్నాయని తెలిపారు.